క్లుప్తంగా

సంక్రాంతి క్రీడలతో నైపుణ్యం మెరుగు



ఐద్వా సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ నాయకురాలు డోకల లక్ష్మి

ఆకివీడు: సంక్రాంతి సంబరాల్లో మహిళా క్రీడా పోటీలకు ఎంతో ప్రాధాన్యత ఉందని ఐద్వా సీనియర్ నాయకురాలు డోకల లక్ష్మి అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం సంక్రాంతి మహిళా పోటీలు సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాల్ని అధిరోహిస్తున్నారని చెప్పారు. మహిళా రక్షణకు స్వీయ రక్షణ ఎంతో ఉత్తమమన్నారు. సంక్రాంతి సందర్భంగా గత 42 ఏళ్లుగా ఆకివీడులో మహిళలకు అనేక విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి ఎస్.ఉదయ కుమారి, కింజరపు పార్వతి, దొడ్డి పద్మ, జీవీ.లావణ్య, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించాలి



పంజావేమవరంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: రైతు సమస్యల పట్ల రెవెన్యూ సిబ్బంది తక్షణం స్పందించాలని తహసీల్దార్ ఏవి రామాంజనేయులు తెలిపారు. వీరవాసరం మండలం పంజావేమవరం గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఏ చిన్న సమస్య వచ్చినా రెవెన్యూ సిబ్బందిని కలవచ్చని సమస్య పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపించడం జరుగుతుందన్నారు. 7 అర్జీలు వచ్చాయని వివరించారు. సమావేశంలో డి.టి సుబ్బారావు, ఆర్ ఐ రూజ్‌వెల్ట్, వీఆర్వో సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతరకు ఏర్పాట్లు

మొగల్తూరు: స్థానిక నడివీధి ముత్యాలమ్మ అమ్మవారి జాతరకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా సంక్రాంతి పండుగ నేపథ్యంలో ముక్కనుము రోజు తర్వాత వచ్చే బుధవారం లేదా ఆదివారం అమ్మవారి జాతరను నిర్వహిహిచడం ఆనవాయితీగా వస్తుంది. దీనిలో భాగంగా గురువారం అమ్మవారిని నిలబెట్టి ఘటాలను ఉంచేందుకు ముందుగా గ్రామంలో ఊరేగించి ప్రధాన రహదారి పక్కనే ఏర్పాటు చేసిన పూరిపాకలో ఉంచారు.

లక్ష్మణేశ్వరుని హుండీ ఆదాయం రూ.1.80 లక్షలు

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో ఉన్న శ్రీదుర్గా లక్ష్మణేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. దేవదాయ శాఖ భీమవరం ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన హుండీ ఆదాయ లెక్కింపులో రూ.1,80,198 ఆదాయం లభించింది. కార్యక్రమాన్ని ఈఓ సీహెచ్ సురేష్ నాయుడు పర్యవేక్షించారు.

గుంపర్రులో ధనుర్మాస పూజలు

యలమంచిలి: మండలంలోని గుంపర్రులో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గోవిందనామ పారాయణం చేశారు. ధనుర్మాసం పురస్కరించుకుని నెల రోజుల పాటు మంచినీటి చెరువు నుంచి తీర్థ బిందెతో నీరు తీసుకువచ్చి స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చక స్వామి కండవల్లి సీతారామ భార్గవ తెలిపారు.

కరుణ, త్యాగానికి ప్రతీక క్రిస్మస్

పెనుగొండ: కరుణ, త్యాగానికి ప్రతీక క్రిస్మస్ అని ఎస్సీ కమీషన్ మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు చెల్లెం ఆనంద్ ప్రకాష్ అన్నారు, గురువారం ఆచంట మండలం నీరుల్లి పాలెంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. క్రిస్మస్ ప్రతీ ఒక్కరి జీవితాల్లోనూ వెలుగులు నింపాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్ వినోద్, గొల్ల క్రాంతి, మట్టా యోహాన్, చెల్లె మోహన్‌రావు, ఖండవల్లి శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి, కొత్తోట గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఆయా గ్రామాల్లోని రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఈ రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పేదలకు 'కూటమి' షాక్

- విద్యుత్ చార్జీల బాదుడుతో వినియోగదారుల గగ్గోలు
- చార్జీల పెంపునకు నిరసనగా నేడు వైఎస్సార్ సీపీ పోరుబాట



భీమవరంలో సీపీఎం ఆధ్వర్యంలో పెరిగిన విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న దృశ్యం(ఫైల్)

భీమవరం: పెరిగిన విద్యుత్‌చార్జీల బిల్లులతో పేద, మధ్యతరగతి ప్రజల గుండె గుభేల్‌మంటోంది. విద్యుత్ ఎక్కువగా వినియోగించని శీతాకాలంలోనే బిల్లులు పెద్దమొత్తంలో వస్తుంటే వేసవికాలంలో విద్యుత్ వాడాలంటేనే భయపడేపరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ బిల్లులు పెంపునకు నిరసనగా వైఎస్సార్‌సీపీ నేతృత్వంలో శుక్రవారం నిర్వహించే విద్యుత్ పోరుబాటకు పార్టీ శ్రేణులతోపాటు ప్రజలు పెద్ద ఎత్తున సిద్ధమవుతున్నారు. ఎన్నికల తరుణంలో కూటమి నాయకులు తాము అధికారంలోనికి వస్తే ఐదేళ్ల పాటు ఎట్టిపరిస్థితుల్లోను విద్యుత్‌చార్జీలు పెంచేది లేదంటూ విస్తృతంగా ప్రచారం చేశారు. దీనిని నమ్మిన ప్రజలు కూటమికి ఓట్లు వేసి గెలిపించిన ఆరు నెలలు గడవకముందే విద్యుత్ చార్జీలు భారీ మొత్తంలో పెంచడంతో ప్రజలు లబోదిబోమంటున్నారు. వాడకం కంటే ఫిక్స్‌డ్‌చార్జీలు, కస్టమర్ చార్జీలు, ఇందనం సర్దుబాటుచార్జీలు అంటూ భారీగా బిల్లులు రావడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వీటితో సరిపెట్టకుండా 2014 నుంచి వాడుకున్న విద్యుత్‌కు ట్రూఅప్ చార్జీలు విధిస్తే గతంలో రూ. వందల్లో వచ్చిన విద్యుత్ బిల్లులు నేడు రూ. వేలకు పెరిగే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిసెంబర్ నెలలో వచ్చిన విద్యుత్ బిల్లులను చూసి షాక్‌కు గురవుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బిల్లులు చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు. డిసెంబర్ నెలలో వచ్చిన బిల్లులను చూస్తే అసలు వాడకం కంటే ఇతరచార్జీలు పెద్ద మొత్తంలో ఉన్నాయి. వాటిలో భీమవరం పట్టణంలోని 0801042523 సర్వీస్ నంబర్‌కు విద్యుత్ వినియోగం ఖర్చు కేవలం రూ.27.72 పైసలు వస్తే ఫిక్స్‌డ్‌చార్జీ రూ. 30, కస్టమర్ చార్జీ రూ. 25, ఇంధనం సర్దుబాటు చార్జీ-1 రూ.267.36, ఇంధనం సర్దుబాటు చార్జీ-2 రూ. 102లతో సహా మొత్తం రూ.447.33 బిల్లు వినియోగదారుని చేతిలో పెట్టారు. దీనితో 6 శాతం విద్యుత్ వాడకం బిల్లు అయితే 94 శాతం అదనపు బిల్లులు వడ్డించారు. అలాగే 1061805 సర్వీస్‌లో అసలు బిల్లు కేవలం రూ. 65 అయితే రూ. 223 అదనపు చార్జీలు కలిపి రూ. 288 చెల్లించాలని బిల్లు చూపించడంతో ఆ వినియోగదారుడు ఆశ్చర్యానికి గురవుతున్నారు. మరొక విచిత్రం ఏమిటంటే పట్టణంలోని దుర్గాపురం ప్రాంతంలో బి బలరామ్ పేరునగల సర్వీస్ నంబర్: 1532470903060542 విద్యుత్ వాడకం లేకపోయినా రూ. 214 బిల్లు వినియోగదారుడికి అందజేశారు. దీనిలో ఫిక్స్‌డ్ చార్జీ రూ. 20, కస్టమర్‌చార్జీ రూ.25, ఎఫ్‌పీపీసీఏ రూ.168.64, మొత్తం రూ.214. ఇలా ప్రతి విద్యుత్ వినియోగదారుడిని నిలువు దోపిడీ చేసే విధంగా బిల్లులు వడ్డన సాగింది.

ఉండిపై విద్యుత్ భారం ఇలా

ఆకివీడు: పెంచిన విద్యుత్ చార్జీలు ఉండి నియోజకవర్గంలోని వినియోగదారులకు పెనుబారంగా ఉన్నాయి. కరెంటు బిల్లు ముట్టుకుంటేనే షాక్ కొట్టే విధంగా బిల్లుల బాదుడు ఉందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బొగ్గు ఇంధనం పేరుతో పెంచిన చార్జీలు సామాన్య మధ్యతరగతి ప్రజలపై పెను భారం పడుతున్నాయి. గోరు చుట్టూమీద రోకలి పోటులా ఆక్వా రంగా విద్యుత్ బిల్లులు ఉన్నాయని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ 2, 3 వందలు వచ్చే బిల్లులు రూ. 500, 600లకు పెరిగిపోయాయని సామాన్యులు ఆపోతున్నారు. నియోజకవర్గంలో ప్రతినెల విద్యుత్ వినియోగం ద్వారా రూ. 28 కోట్ల నుంచి 30 కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. ఈ నెల నుంచి ఈ ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది. నియోజకవర్గంలో 1,20,200 మంది విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. విద్యుత్ బిల్లులు పెరగడంతో చిరు వ్యాపారులు మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతంత మాత్రమే ఉన్న వ్యాపారాలతో అద్దెలు కట్టలేక దుకాణాల్లో సరుకులు కొనలేక అప్పులకు వడ్డీలు కట్టలేక సతమతమవుతున్న తమపై విద్యుత్ చార్జీలు పెనుబారంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ దోపిడీని అడ్డుకుందాం



కూటమి ప్రభుత్వం ప్రజల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లు చేస్తున్న విద్యుత్ బిల్లులను అడ్డుకుందాం. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచమంటూ ఊదరగొట్టి అధికారంలోనికి వచ్చిన ఆరు నెలల్లోనే భారీ మొత్తంలో వసూళ్లకు దిగడం దారుణం. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలకు నిరసనగా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే పోరుబాట కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి కనువిప్పుకలిగిద్దాం.

– గాదిరాజు రామరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్, భీమవరం

ప్రజలను నిలువునా మోసం చేసిన కూటమి



విద్యుత్ బిల్లులు పెంపు విషయంలో కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసింది. ఎన్నికల సమయంలో విద్యుత్ బిల్లులు పెంచమంటూ హామీలిచ్చి దారుణంగా పెంచడం చూస్తుంటే ఎన్నికల హామీలన్ని గాలికి వదిలినట్లే కన్పిస్తున్నాయి. విపరీతంగా పెరిగిన నిత్యావసరసరుకులు, కూరగాయల ధరలతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే గోరుచుట్టుపై రోకలి పోటుగా విద్యుత్ చార్జీలు పరిణమించాయి.

– జి.రఫాయేలు, సీపీఎం నాయకుడు

సార్వత్రిక విద్యాపీఠం ప్రవేశ దరఖాస్తుల గడువు పొడిగింపు

భీమవరం: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం టెన్త్, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశానికి తత్కాల్ స్కీమ్‌లో ఈనెల 31వ తేది వరకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఇ నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 600 అపరాధ రుసుంతో రిజిస్ట్రేషన్, దరఖాస్తు చేసుకోడానికి ఈనెల 27వ తేదీ, ఎ.ఐ సమన్వయకర్తలు, దరఖాస్తు నిర్ధారణకు ఈనెల 30వ తేది, పరీక్ష రుసుం చెల్లించడానికి 31వ తేది వరకు గడువు ఇచ్చినట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నారాయణ కోరారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

భీమవరం: ఉపాధ్యాయులకు సమ్మెట్ విద్య, డాటాబేస్ మేనేజ్‌మెంట్, కొలాబరేషన్, కరికులం డిజైన్ ప్రిన్సిపల్స్ వంటి వివిధ అంశాల్లో నైపుణ్యాన్ని పెంపొందించడానికి శిక్షణ ఎంతైనా అవసరమని అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సీహెచ్ ఎస్‌వి సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం భీమవరం పట్టణంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో జిల్లాలోని 160 మంది పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారం రోజులు పాటు నిర్వహించే శిక్షణ తరగతులను ప్రారంభించి ఆయన మాట్లాడారు. స్కూల్ లీడర్‌షిప్ సైకిల్-2, బ్యాచ్-2 సాల్ట్ ప్రోగ్రాంలో భాగంగా ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో నాయకత్వ లక్షణాలను మరింత మెరుగుపర్చుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మోనిటరింగ్ ఆఫీసర్ పి ఏసుదాసు, మాస్టర్ ఫెసిలిటేటర్స్ జి కృష్ణవేణి, నేతల భీమారావు, జి శ్రీనివాస్, సీహెచ్ రవికుమార్, ఎస్వీఆర్ మూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు 8 గ్రాముల బంగారం సమర్పణ

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారికి భీమవరానికి చెందిన ఎం.సుబ్రమణ్య పవన్ 8 గ్రాముల బంగారాన్ని సమర్పించారు.ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ సుబ్రమణ్య పవన్‌కు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్

నరసాపురం రూరల్: మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు కేసరి కోటేశ్వరరావుకు డాక్టరేట్ లభించింది. సింథసీస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ రేర్ యర్త్ డోప్‌డ్ సిఏ3, ఎఎల్2ఓ 6ఫాస్ఫర్ ఫర్ డిస్ప్లే డివైజ్ అప్లికేషన్ అనే అంశంపై చేసిన పరిశోధనకు ఆయన డాక్టరేట్ సాధించారు. కృష్ణా యూనివర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ అండ్ కన్వీనర్ డాక్టర్ ఎంసీ రావు, పీజీ బోర్డ్ ఆఫ్ చైర్మన్ ప్రొఫెసర్ కె సమత, పలువురు ప్రొఫెసర్ల పర్యవేక్షణలో ఆయన ఈ పరిశోధన చేశారు. డాక్టరేట్ సాధించిన కోటేశ్వరరావును స్వర్ణాంధ్ర కళాశాల చైర్మన్ కె.సత్యనారాయణ, ట్రెజర్ కె.త్రినాథ వెంకటేశ్వరస్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి తదితరలు అభినందించారు.

వైభవంగా అమ్మవార్ల ఊరేగింపు



అమ్మవార్లను ఊరేగిస్తున్న దృశ్యం

ఆకివీడు: మార్గశిర బహుళ ఏకాదశి పర్వదినం రోజున అమ్మవార్లను గ్రామంలో ఊరేగించడం ద్వారా గ్రామం సుభిక్షంగా ఉంటుందని స్థానిక పెద్దింటి అమ్మవారి ఆలయ అర్చకులు మొవ్వా చందు చెప్పారు. స్థానిక పెద్దింటి అమ్మవారు, మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్లను గురువారం గ్రామంలో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవార్లకు హారతులు పట్టారు. కార్యక్రమంలో అర్చకులు మొవ్వ వెంకటరత్నం, సుదర్శన శేషాచార్యులు పాల్గొన్నారు.

రీ-సర్వే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలి



అజ్జమూరులో మహిళ నుంచి వినతిని తీసుకుంటున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

ఆకివీడు: రీ-సర్వే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి చెప్పారు. మండలంలోని అజ్జమూరు గ్రామంలో గ్రామ రెవెన్యూ సదస్సులో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీ-సర్వేలో లోపాలను పలువురు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారులకు నోటీసులు జారీ చేసి, ఆయా ఫిర్యాదులను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదులు మళ్లీ రాకుండా చూడాలన్నారు. అనంతరం జేసీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదుల్ని పరిశీలించారు. తాళ్లకోడులో ఇళ్ల స్థల ప్రాంతంలో ఆక్రమణలు జరుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో ఆ ప్రాంతంలో పర్యటించారు. తాళ్లకోడులో లబ్ధిదారులు ఎంత మంది? ఎన్ని ఖాళీ స్థలాలున్నాయి? అనే దానిపై జాబితా ఇవ్వాలని తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావుకు సూచించారు. అజ్జమూరులోని ఐస్ ఫ్యాక్టరీ మురుగు, ఆయిల్ నీరు తమ పంట కాల్వలోకి వస్తుందని, తన పొలం నుండి పైప్‌లైన్ అక్రమంగా నిర్మించారని వచ్చిన ఫిర్యాదుకు ఆ ప్రాంతంలో పర్యటించి, పంట కాలువను సర్వే చేయాలని ఆదేశించారు. అదే గ్రామంలో ఆక్రమణలకు గురైన పంట కాల్వను సర్వే చేయాలని సర్వేయిర్ తాడి రవితేజకు సూచించారు. పెదకాపవరంలో ఆక్రమణలపైన, స్థానిక అమృతరావు కాలనీలో శ్మశానభూమిని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ అంజనేయులు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల రత్నం, సర్పంచ్ చిలంకుర్తి చలపతిరావు, వీఆర్వో జయరాజు, నంద్యాల చల్లారావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



భీమవరంలో గూగుల్ మీట్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న నాగరాణి

భీమవరం: టెన్త్ విద్యార్థులు చదువుపై ఏకాగ్రతతో మంచి ఫలితాన్ని సాధించవచ్చునని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం భీమవరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరతగతి విద్యార్థులతో గూగుల్ మీట్‌లో పాల్గొని పరీక్షల ఉత్తీర్ణతపై దిశా నిర్దేశం చేశారు. ప్రతి విద్యార్థికి టెన్త్ ఉత్తీర్ణత ఎంతో కీలకమైనదన్నారు. ఏకాగ్రతతో చదివితే ఏది కష్టంకాదని, చదువుపై మనసును లగ్నం చేసుకునేలా శిక్షణ అవసరమన్నారు. జిల్లాలోని టెన్త్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలోనే జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని కలెక్టర్ నాగరాణి కోరారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఇ నారాయణ, ఐసీడీఎస్ పీడీ బి సుజాత రాణి, తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు చక్కని ప్లానింగ్‌తో చదవాలి



భీమవరం వైఎస్సార్ శాఖా గ్రంథాలయంలో రఫీని సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా గుంటూరు ప్రభుత్వ కళాశాల హిస్టరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్ఎం రఫీ మాట్లాడుతూ పోటీపరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు చక్కని ప్లానింగ్‌తో చదవాలన్నారు. పరీక్షలకు ఎక్కువ పుస్తకాలు చదివే కంటే ఒకపుస్తకాన్నే ఎక్కువ పర్యాయాలు రివిజన్ చేయండం వల్ల ఉపయోగం ఉంటుందన్నారు. రాజుల కాలంలోని సాంఘిక, సాంస్కృతిక అంశాలపై ఎక్కువగా ప్రశ్నలు వస్తాయని, మైనస్ మార్కులు ఉన్నందున తెలియని ప్రశ్నలు జోలికి పోవద్దని రఫీ తెలిపారు. అనంతరం రఫీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రామనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు నాగయ్య వర్మ



నాగయ్య వర్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ప్రజా సమస్యల కోసం ప్రాణత్యాగం చేసిన మైలా నాగయ్య వర్మ చిరస్మరణీయుడని వ్యవసాయ సీపీఎం నాయకులు ఎం ఆంజనేయులు అన్నారు. భీమవరం మండలంలోని తోకతిప్ప, కొత్తపూసలమర్రు గ్రామాలలో భూ పోరాట యోధుడు మైలా నాగయ్య వర్మ 53వ వర్ధంతి సభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్, రేవు రామకృష్ణలు మాట్లాడుతూ 1970లో అటవీ, బంజరు భూములు పేదలకు పంచాలని సీపీఎం ఆధ్వర్యంలో భూ పోరాటాలు పెద్దెత్తున జరిగాయన్నారు. అప్పటికే కాళ్ల మండలంలోని కొంత మంది భూస్వాములు ఈ భూములు ఆక్రమించుకుని పేదల కడుపులు కొట్టేవారన్నారు. అప్పట్లో ప్రజా సమస్యల కోసం పోరాడుతున్న నాగయ్య వర్మ అడ్డుతొలగించుకోవాలనే ఉద్దేశ్యంలో చర్చలకు పిలిచి అతి దారుణంగా 1971 లో హత్య చేశారన్నారు. ఆయన ప్రాణ త్యాగ ఫలితమే కొత్తపూసలమర్రు, దొంగపిండి, తోకతిప్ప పేదలకు ప్రభుత్వం అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొడ్డు లక్ష్మీపతి, కొల్లాటి గోవిందరాజు, వల్లభనేని బ్రహ్మం, శ్రీరాములు, బస్వాని నాగరాజు, నరసింహస్వామి, పొన్నమండ నాగేశ్వరరావు, బొమ్మిడి రాంబాబు, కిషోర్, కొల్లాటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం సేకరణలో లక్ష్యాలను సాధించాలి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం: బియ్యం సేకరణలో నిర్ణీత సమయంలో లక్ష్యాలను సాధించాలని జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో బియ్యం సేకరణ, ధాన్యం కొనుగోలు, గోడౌన్ల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 3 లక్షల 85 వేలు మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించడం పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో బియ్యం సేకరణ కూడా లక్ష్యాలు సాధించాలన్నారు. జిల్లాలో 2.59 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాల్సి ఉండగా ఇప్పటివరకు 1.03 లక్షల మెట్రిక్ టన్నులు బియ్యం సేకరణ జరిగిందని, మిగిలిన 1.56 లక్షల మెట్రిక్ టన్నులు బియ్యాన్ని ఫిబ్రవరి నెల చివరినాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బియ్యం సేకరణలో ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకుని నిర్ణీత గడువు లోగా బియ్యం సేకరణ పూర్తి చేయాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు కలిసికట్టుగా పనిచేసి పశ్చిమ గోదావరి జిల్లాను మొదటి స్థానం నిలిచేలా సమష్టిగా కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజరు టి.శివరామ ప్రసాద్, ఎఫ్సీఐ డీఎం రవీంద్ర రెడ్డి, మేనేజరు రంజిత్ కుమార్, సహాయక మేనేజరు ఎండీ ఇబ్రహీమ్, భానుమూర్తి, సీడబ్ల్యూసి మేనేజరు వేణు, ఇతర గౌడౌన్స్ మేనేజర్లు, రైసు మిల్లర్స్ అధ్యక్షుడు జిల్లా సామంత పూడి శ్రీరామరాజు, తదితరులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో ముందుకెళ్లాలి



భీమవరంలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రజాప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: దేశ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఘన చరిత్ర సీపీఐకే దక్కిందని ఆపార్టీ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. సీపీఐ శతవసంతాల వేడుకను భీమవరంలో గురువారం ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భీమారావు మాట్లాడుతూ రష్యా విప్లవం స్ఫూర్తితో 1925 డిసెంబరు 26న కాన్పూరులో సీపీఐ ఆవిర్భవించిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగు వేల మందికి పైగా చనిపోగా పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన భూ పోరాటంలో 18 మంది చనిపోయారని అమరుల స్ఫూర్తితో ముందుకెళ్లాలని పిలుపు నిచ్చారు. ముందుగా పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. పట్టణ వీధుల్లో ప్రజా ప్రదర్శన నిర్వహించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎం సీతారాంప్రసాద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, అగ్రిగోల్డ్ ఏజెంట్స్ కస్టమర్స్ అసోసియేషన్ నాయకులు కె.గోపాలకృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వైవి ఆనంద్, మల్లుల శ్రీనివాసరావు, మామిడిశెట్టి లక్ష్మీపతి, కోడెల యామిని, నాగిడి తులసీరావు, తిరుమాని కామేశ్వరరావు, తిరుమాని చంటిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి రంగా వర్ధంతి



భీమవరం: పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



కాళ్ల: ఏలూరుపాడులో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని పలు గ్రామాల్లో వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం రంగా అభిమానులు ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా కాళ్ల, ఏలూరుపాడు, దొడ్డనపూడి, సీసలి, పెదఅమీరం తదితర గ్రామాల్లో తొలుత రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి వంగవీటి మోహన రంగా ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎరుబండి రామాంజనేయులు, కాపు సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు పుప్పాల బుజ్జి, చిన్నాపరపు రాంబాబు, వక్కపట్ల హరిబాబు, నారిన నాగు, నల్లగచ్చు నాగార్జున, సూదాబత్తుల వంశీ, యాళ్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

భీమవరం: రాజకీయ, సామాజిక పరంగా అందరి మనస్సులో శాశ్వతంగా నిలిచిన వ్యక్తి వంగవీటి మోహన్‌రంగ అని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. గురువారం వంగవీటి మోహనరంగ వర్ధంతి సందర్భంగా భీమవరం తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని రంగ విగ్రహానికి అంజిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. రాధా రంగామిత్రమండలి జిల్లా గౌరవాధ్యక్షుడు ఉండపల్లి రమేష్‌నాయుడు, చెనమల చంద్రశేఖర్, యిర్రింకి సూర్యారావు మాట్లాడుతూ రంగ పేదల పక్షపాతిగా పనిచేసి అన్ని వర్గాల అభిమానం పొందారని కొనియాడారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆగిశెట్టి సిడ్నీ, బొర్రా బాలాజీ, బోకూరి విజయరాజు, సాయి, యర్రంశెట్టి శివకృష్ణ, కోయ రాంబాబు, చల్లా రాము, కొప్పినీడి బాబీ,గంటా సుందరకుమార్, విజ్జురోతి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.